క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



బాల్కొండ: బాల్కొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతనంగా మంజూరైన 5 ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ట్రాన్స్‌కో డీఈ రమేశ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోవోల్టేజీ సమస్య ఉండటంతో నూతన 5 ఎంవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌టీ డీఈ వెంకటరమణ, ఏడీఈ నటరాజ్, ఏఈ కిషన్, సబ్‌ఇంజినీర్ మహేశ్, లైన్‌మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి భూమిపూజ



వేల్పూర్: మండలంలోని లక్కోర గ్రామంలో నేషనల్ హెల్త్ మిషన్ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించే ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి అధికారులు, నాయకులు సోమవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, వేల్పూర్ ఎంపీడీవో బాలకిషన్, పీహెచ్‌సీ వైద్యాధికారి వీణ, పీఆర్ ఏఈ శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బైరి శ్రీధర్, ఏఎంసీ డైరెక్టర్ నరేందర్, సొసైటీ డైరెక్టర్ రాజేందర్, యూత్‌కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఆత్మారాం, జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్, రమణ, ఆరోగ్యకార్యకర్త భాగ్య, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిండిన సోన్‌పేట్ చెరువు



బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్ గ్రామం శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువనే ఉన్నా వర్షపు నీటి కోసం ఎదురు చూడాల్సిందే. చెరువు కింద 300 ఎకరాల సాగు భూమి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి భారీగా నీరు వచ్చి చేరింది. దీంతో తూం ద్వారా నీటి విడుదల చేపడుతున్నారు. దీంతో ఆయకట్టు ప్రాంతంలో రైతులు వరి నాట్లు వేయడంలో బిజీ అయ్యారు. చెరువును శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటితో నింపుటకు ప్రాజెక్ట్ అధికారులు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తహసీల్ కార్యాలయం తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ తహసీల్ కార్యాలయాన్ని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది డబ్బులు వసూలు చేయడంపై ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. పక్కా ఆధారులుంటే సిబ్బంది చర్యలు తీసుకోనున్న ట్లు తెలిపారు. అలాగే ధ్రువీకరణ పత్రాలను సకాలంలో అందజేయకుంటే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని గోశాల రోడ్డులో పిచ్చి కుక్కదాడి చేసి ఐదుగురిని గాయపరిచింది. కుక్క దాడిలో గాయపడిన వా రు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి చికిత్స పొందారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని బల్దియా అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పొలం గట్టు వద్ద ఘర్షణ

- కేసు నమోదు

రుద్రూర్: పోతంగల్ మండలం కొల్లూర్ గ్రామ శివారులో పొలం గట్టు వద్ద జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలు కాగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై సునీల్ తెలిపారు. కొల్లూర్ శివారులోని పొలం వద్ద మందర్నా నాగనాథ్‌ను ముగ్గురు వ్యక్తులు గొడవపడి గాయపరిచారు. నాగనాథ్ కుమారుడు రాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం సోంపూర్ శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టాటా వాహనం, ఆటోలను సోమవారం పట్టుకున్నట్టు ఎస్సై సునీల్ తెలిపారు. వాహనాలను కోటగిరి పోలీస్‌స్టేషన్ కు తరలించామని, డ్రైవర్, వాహన యాజమానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


గ్రామాల్లో వినాయక చవితి శోభ

- ఏర్పాట్లు చేస్తున్న మండపాల నిర్వాహకులు
- ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ



గ్రామాల్లో వినాయక చవితి సందడి ప్రారంభమైంది. బుధవారం వినాయక చవితి పండుగ జరుగనుంది. వినాయక నవరాత్రులు తమదైన శైలిలో నిర్వహించడానికి మండపాల నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.వీరిపై ప్రత్యేక కథనం.

అంకాపూర్‌లో రోజ్‌వుడ్ వల్లభ గణపతి



ప్రతిష్ఠించనున్న రోజ్‌వుడ్ గణపతి

ఆర్మూర్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామస్తులు హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో వినాయక చవితితో పాటు నవరాత్రులు తమదైన శైలిలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మైసూర్‌కు చెందిన విశ్వకర్మ చేతివృత్తి కళాకారులచే రోజ్‌వుడ్ కట్టెతో రూపొందించిన వల్లభ గణపతిని ప్రతిష్ఠించి నవరాత్రులకు సిద్ధమయ్యారు. గ్రామంలోని వేముల సత్యమ్మ బద్దాగౌడ్ ఫంక్షన్ హాల్‌లో మొదటిసారిగా ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. దాతల సహకారంతో రూ.9 లక్షల వ్యయంతో రూపొందించిన ఈ ఆరు అడుగుల వల్లభ గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నిర్మల్ జిల్లా భైంసా ప్రాంతంలోని పాలజ్‌లో భక్తులను ఆకట్టుకునే చెక్క గణపతి తరహాలో అంకాపూర్‌లో ప్రతిష్ఠించే ఈ రోజ్ వుడ్ గణపతి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వినాయక చవితి రోజున విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం మటి విగ్రహాన్ని సైతం ప్రతిష్ఠిస్తారు. పదకొండు రోజుల పాటు నిత్య పూజ, హారతి, అర్చన, అభిషేకం, గణపతి హోమం నిర్విరామంగా నిర్వహించనున్నారు. దీంతో తమ గ్రామానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని హిందూ సేవా సమితి అధ్యక్షులు చల్లా చిన్న బుర్రన్న, ఉపాధ్యక్షులు సాయిలు యాదవ్, కోశాధికారి అంకాపూర్ సంతోష్ రెడ్డి, సెక్రటరీ గాజుల రవి, జాయింట్ సెక్రెటరీ క్రాంతి కుమార్, ముఖ్య సలహాదారుడు పేట భాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు కమిటీ మెంబర్లు ఆశిస్తున్నారు. ఈ వల్లభ గణపతిని భక్తులు దర్శించుకోవాలని గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరుతున్నారు.

18 ఏళ్లుగా మట్టి విగ్రహాల పంపిణీ



మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయుడు రఘునాథ్ (ఫైల్)

వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ హైస్కూలులో రసాయన శాస్త్రం బోధించే టీచర్ రఘునాథ్ 18 ఏళ్లుగా మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తనవంతు పాత్ర పోషిస్తున్నారు. 2009 నుంచి తాను పనిచేసిన లక్కోర, సుర్బిర్యాల్ పాఠశాలల్లో మట్టి గణపతుల విగ్రహాల తయారీని ప్రారంభించి ప్రతి ఏడాది కొనసాగిస్తూ, విద్యార్థులతో తయారు చేయిస్తున్నారు. మట్టి విగ్రహాలతో పర్యావరణానికి ఏ విధంగా మేలు జరుగుతుంది, పీవోపీతో చేసే విగ్రహాలతో పర్యావరణం ఏ విధంగా కలుషితం అవుతుందో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. మట్టి విగ్రహాలను తయారు చేసి వాటిని వినాయక చవితి పండుగ కోసం తాను పనిచేసే పాఠశాలలో విద్యార్థులు, గ్రామస్తులకు పంచుతున్నారు.

రుద్రూర్‌లో 75 ఏళ్లుగా..



అందంగా తీర్చిదిద్దిన రుద్రూర్ సార్వజనిక్ గణేశ్ మండలి మండపం



మండపం గోడలపై చిత్రించిన ఇతిహాస చిత్రాలు

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలో గత 75 ఏళ్లుగా వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 1950లో సార్వ జనిక్ గణేశ్ మండలి ఏర్పాటు చేశారు. స్థానిక విఠలేశ్వర స్వామి ఆలయంలో తొలి గణనాథున్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించారు. నాటి నుంచి ప్రతి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఐదేళ్ల క్రితం రుక్మిణి సహిత విఠలేశ్వర ఆలయం పునః నిర్మించారు. పక్కనే సిద్ధి వినాయకుడి శాశ్వత మండపం నిర్మించారు. గతంలో సిల్వర్ జూబ్లీ, గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించగా, ఈ ఏడాది డైమండ్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహలు ప్రారంభించారు. ప్రతిష్ఠించే గణనాథుని కొనుగోలుకు 75 మంది దాతలు ముందుకు వచ్చారు. డైమండ్ జూబ్లీ ఉత్సవాలకు సుమా రూ రూ. 25లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేశారు. నవరాత్రుల్లో మండపం వద్ద ప్రతి రోజు హోమం, అధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించనున్నారు. సిద్ది వినాయకుడి మండపం గోడలపై వినాయకుడి ఇతివృత్తం తెలిపే ఇతిహాస చిత్రాలు వేయించారు. ఈసందర్భంగా బస్టాండ్ సమీపంలోని మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేయాలని నిర్ణయించగా, ఏర్పాట్లు చేస్తున్నారు. డైమండ్ జూబ్లీ ఉత్సవాలు విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని నిర్వహకులు కోరారు.

మట్టి గణపతులు తయారు చేసిన విద్యార్థులు



తయారు చేసిన మట్టి గణపతులతో విద్యార్థులు

బాల్కొండ: మండలంలోని కిసాన్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి గణపతులను సోమవారం తయారు చేశారు. మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. మట్టి గణపతులు తయారు చేసిన విద్యార్థులను హెచ్‌ఎం కృష్ణవేణి, టీచరు అభినందించారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



రుద్రూర్: పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై సాయన్న సూచించారు. రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం పెద్దలతో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. మండపాల్లో ప్రార్థన మందిరాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మి శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని సూచించారు.

వీధి ఆహార విక్రేతలు పరిశుభ్రతను పాటించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): వీధి ఆహార విక్రేతలు పరిశుభ్రతను పాటించాలని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ సునీత అన్నారు. సోమవారం స్థానిక బల్దియా కార్యాలయంలో నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా, నెస్లే ఇండియా, తెలంగాణ సంయుక్తంగా వీధి ఆహార విక్రేతలకు పరిశుభ్రతపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. వీధి ఆహార విక్రేతలు పరిశుభ్రతను పాటించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని రక్షించవచ్చని, ప్లాస్టిక్‌ను వాడకుండా, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అనంతరం ఎన్ఏఎస్వీఐ రాష్ట్ర అధ్యక్షులు రంగా శాలివాన్ మాట్లాడుతూ వీధి ఆహార విక్రేతల హక్కుల కోసం పోరాడుతున్నామని, సర్వే సేఫ్ ఫుడ్ కింద రాష్ట్ర వ్యాప్తంగా 2019 నుంచి 10 వేల మందికి శిక్షణను ఇప్పించామన్నారు. అనంతరం వీధి ఆహార విక్రేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షకులు పోనాల దినాకర్, రాజీవ్ కుమార్, కమిషనర్ జాదవ్ కృష్ణ, మెప్మా టీఎమ్‌సీ శ్రీనివాస్, ఆర్పీలు, సావోలు పాల్గొన్నారు.

రోటరీ సేవలు విస్తరిస్తాం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హన్మంత్‌రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): రోటరీ ఆధ్వర్యంలో సేవలను విస్తరిస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల రాధకిషన్, ఖాందేష్ సత్యం అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఆదివారం రాత్రి రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నూతన కార్యవర్గంచే రోటరీ 3150 మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్వీ హన్మంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ రోటరి ఆధ్వర్యంలో పోలియో నివారణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కోశాధికారి కోట నరేశ్, జైపాల్ రెడ్డి, రజనీష్ కిరాడ్, కాంతి గంగా రెడ్డి, లింగా గౌడ్, విజయ సారథి, దాసరి సునీల్ కుమార్, పుష్పాకర్ రావు, చంద్రసేన రెడ్డి, సీహెచ్ రాజా రావు, కే రాజేందర్, వీ గంగా రెడ్డి, గంగామోహన్ చక్రు, చరణ్ రెడ్డి, పీ ప్రవీణ్, పీ గోపి కృష్ణ, ఖాందేష్ శ్రీనివాస్, పీ తులసి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల కమిషన్ ఇప్పించాలి



వేల్పూర్ తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్‌డీలర్లు

రుద్రూర్/వేల్పూర్ : ఐదు నెలల కమిషన్ ఇప్పించాలని రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు.ఈమేరకు సోమవారం రుద్రూర్ ఉప తహసీల్దార్ సురేందర్ నాయక్‌కు, వేల్పూర్ తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రేషన్‌డీలర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మూడు నెలల బియ్యాన్ని పంపిణీ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం వేరువేరుగా కమిషన్ విడుదల చేయడంతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. గతంలో మాదిరిగా పాత పద్ధతిలోనే కమిషన్ విడుదల చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో రేషన్‌డీలర్లు ఉన్నారు.

గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

- రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధికి పాటుపడాలి
- పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి పంపిస్తాం
- ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి



సాలూరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి

బోధన్: గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం గ్రంథాలయాల నిర్వహణపై నిర్లక్ష్యం వహించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంతరం జిల్లా గ్రంథాలయ సంస్థలకు చైర్మన్‌లను నియమించి, వాటి అభివృద్ధికి పూర్తి స్థాయిలో దృష్టిసారించామన్నారు. విద్యార్థులు, యువత గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమవారం సాలూర మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రూ.13లక్షల 50 వేలతో నిర్మించిన నూతన భవనం, ఈ భవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన సీఎస్‌సీ(కస్టమర్ సర్వీస్ సెంటర్),గ్రంథాలయ శాఖను ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు.ఖాజాపూర్ గ్రామ శివారులో వరద నీట మునిగిన నష్టం వాటిల్లిన సోయా పంటను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నూతన గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మిస్తామని తెలిపారు. రాజకీయాలకతీతంగా కలిసికట్టుగా గ్రామ ప్రజలు అభివృద్ధికి పాటుపడాలన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తోందని, క్షేత్రస్థాయిలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన చర్యలుంటాయని పేర్కొన్నారు. బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఫ్యాక్టరీ ఐదారు నెలలు క్రషింగ్ నడిచేందుకు సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల చెరుకు అవసరం ఉంటుందన్నారు. రైతులు చెరుకును విస్తృతంగా సాగు చేయాల్సి ఉంటుందన్నారు. లాభదాయకమైన ఆయిల్‌పామ్‌ను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఆయిల్‌పాం ఫ్యాక్టరీ ఏర్పాటు చేసుకుందామన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల సాలూర మండలంలోని సాలూర, హున్సా.ఖాజాపూర్, మందర్నా గ్రామాల శివారులో నీట మునిగి పంటలకు నష్టం వాటిల్లిందని, పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్,టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, డీసీసీబీ డైరెక్టర్ శరత్, ఏఎంసీ డైరెక్టర్ ఆవుల బాలకృష్ణారెడ్డి,నాయకులు బిల్ల రాంమోహన్, నాగేశ్వర్‌రావు, మందర్నా రవి, ఇల్తెపు శంకర్, సొసైటీ సీఈవో బస్వంత్‌రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరలో టీఎల్ఎం మేళా



బోధన్: సాలూర పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం మండల స్థాయి టీచింగ్ లెర్నింగ్ మేళాను నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ శశిభూషణ్, ఎంఈవో రాజిమంజూష, ఎంపీడీవో శ్రీనివాస్ మేళాను ప్రారంభించారు. వివిధ పాఠశాల ఉపాధ్యాయులు తెలుగు,గణితం,ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించి బోధనోపకరణలను ప్రదర్శించారు. అధికారులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. మేళాలో 10 మంది ఉపాధ్యాయులు ప్రదర్శించిన బోధనోపకరణలను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో నిర్వహించే మేళాకు పంపిస్తామని ఎంఈవో తెలిపారు.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందిస్తాం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పాల్గొన్న డీఈవో అశోక్, ఎంఈవో నాగయ్య

బోధన్: దివ్యాంగ విద్యార్థులకు త్వరలోనే సహాయ ఉపకరణాలు అందిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు.తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్ష, భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ సోమవారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో డివిజన్ స్థాయి దివ్యాంగ విద్యార్థుల సహాయ ఉపకరణాల గుర్తింపు, నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఈవో మాట్లాడారు. గత ఏడాది అలిమ్కో సంస్థ ద్వారా రూ.30 లక్షల విలువ చేసే సహాయ ఉపకరణాలు దివ్యాంగ విద్యార్థులు అందించమన్నారు. ప్రస్తుతం శిబిరానికి 130 మంది దివ్యాంగ విద్యార్థులు హాజరు కాగా, ఇందులో 90 మందికి సహాయ ఉపకరణాలు అవసరం గుర్తించమన్నారు. వీరికి 45 నుంచి 90 రోజుల్లో సహాయ ఉపకరణాలు అందిస్తామన్నారు. ఎంఈవో నాగయ్య, సమగ్ర శిక్ష జిల్లా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రభుత్వ వైద్యుడు భాస్కర్‌రావు, వైద్యులు ద్వివేది ఓం, రుక్మిణి, ప్రత్యేక అవసరాల విద్యార్థుల టీచర్లు విశ్వనాథ్, మురళి, శంకర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన డీఈవో

బోధన్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని డీఈవో అశోక్ సోమవారం సందర్శించారు. గ్రామ పంచాయితీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎంపీడీవో మధుకర్‌తో మాట్లాడి గ్రామ పంచాయితీ ఎన్నికల, రికార్డులు సమాచారం తెలుసుకున్నారు. ఎంఈవో నాగయ్య ఉన్నారు.

సంక్షిప్తం

28న బీఆర్ఎస్ గూటికి కాంగ్రెస్ బహిష్కృత నేత

వర్ని: కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేత రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు, వర్ని మండల ఉపాధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు ఈనెల 28న కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని ఇటీవల శ్రీనివాసరావును కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి అనుచరుడుగా ఉంటూ కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్రకటనలు ఇవ్వడం, విమర్శించడంతో పార్టీ అధిష్టానం ఎలమంచిలిని సస్పెండ్ చేసింది. దీంతో ఆయన అనుచరవర్గంతో కలిసి ఈనెల 28న కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఆయనతో పాటు కోటగిరి మాజీ ఎంపీపీ వల్లేపల్లి సునీత భర్త కోటగిరి వైస్ ఎంపీపీ శ్రీనివాసరావుతోపాటు ఇతర నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు తెలిసింది.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' అమలు చేయాలి

నందిపేట్(ఆర్మూర్): ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరుతూ సోమవారం నందిపేట మండలంలోని తల్వేదలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆత్మీయ భరోసా పథకాన్ని అన్ని గ్రామాల్లో అమలు చేస్తూ రూ. 12 వేలు అందించాలని కోరారు. అనంతరం జీపీ కార్యదర్శి చిన్నయ్యకు వినతిపత్రం అందజేశారు. నాయకులు కె.గంగాదర్, భోజమ్మ, సునీత, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై మహిళలకు అవగాహన

నందిపేట్(ఆర్మూర్): నందిపేట మండల కేంద్రంలోని మహిళాశక్తి భవనంలో సోమవారం రక్తహీనతపై మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు హీమోగ్లోబిన్, బీపీ, షుగర్ టెస్టులను నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి ప్రవీణ్‌లు మాట్లాడుతూ హీమోగ్లోబిన్ శరీరంలో అన్ని కణాలకు ఆక్సిజన్‌ను అందిస్తుందన్నారు. మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఐకేపీ ఏపీఎం ఖాందేష్ గంగాధర్, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

బాల్కొండ: క్రీడల్లో రాణించాలని ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ అన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో భూదేవి ఇండోర్ స్టేడియంలో వారం రోజులుగా కొనసాగిన తెలంగాణ ప్రో కబడ్డీ క్రీడాకారుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పల్లె ప్రాంతాల్లో శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ ప్రశాంత్, పీడీ రాజ్‌కుమార్, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

నందిపేట్(ఆర్మూర్): క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినిని పాఠశాల బృందం అభినందించింది. ఈ నెల 23న నాగారంలో నిర్వహించిన అండర్ -14 అథ్లెటిక్ మీట్‌లో అనాస్ 60 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం, లాంగ్‌జంప్‌లో కాంస్య పతకం, బ్యాక్ త్రోలో కాంస్య పతకం సాధించాడు. మండలకేంద్రంలోని సిద్దార్థ పాఠశాలలో షేక్ అనాస్ చదువుతున్నాడు. ఈసందర్భంగా విద్యార్థి అనాస్‌ను సోమవారం పాఠశాల కరస్పాండెంట్ దేవన్న, డైరెక్టర్ వంశీ, హెచ్‌ఎం ప్రవీణ్, వ్యాయమ ఉపాధ్యాయుడు రంజిత్, ఉపాధ్యాయులు అభినందించారు.

కరాటేలో బంగారు పతకం సాధించిన విద్యార్థి

నవీపేట: మండలంలోని ధర్మారం(ఏ) గ్రామానికి చెందిన ఆరో తరగతి విద్యార్థి సూర హర్షవర్ధన్ చెన్నైలో ఈనెల 24న జరిగిన కరాటే పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకాన్ని సాధించాడు. హైదరాబాద్‌లోని ప్రయివేట్ పాఠశాలలో హర్షవర్ధన్ విద్యనభ్యసిస్తున్నాడు. ఒకినోవా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 విభాగంలో హర్షవర్ధన్ ఉత్తమ ప్రతిభను కనబరచడంతో బంగారు పతకాన్ని సాధించినట్లు తండ్రి వెంకట్ తెలిపారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతిభ పోటీలు

బోధన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రతిభ పోటీలు దోహదపడుతాయని ఎడపల్లి ఎంఈవో శివలింగ్ గాలప్ప అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి శాఖ ఆధ్వర్యంలో ఇటీవల మండల స్థాయి పాఠశాల విద్యార్థులకు భావి భారత సమాజ నిర్మాణానికి మనవంతు పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ పోటీలో ఎడపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని అనూష్ ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచింది.సోమవారం మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో విద్యార్థిని అనూషను ఎంఈవో సన్మానించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పుష్పలత, మెర్సి, ప్రతినిధులు శంకర్, గంగారెడ్డి,కదంప్రకాష్, నార్ల కాశీనాథ్ గుప్తా, పాఠశాల హెచ్‌ఎం రవికుమార్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

రుద్రూర్: విద్యార్థి దశ నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తే తప్పకుండా లక్ష్యాన్ని చేరుకుంటారని వ్యక్తిత్వ వికాస నిపుణులు తిరునగరి శ్రీహరి, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్ ఎం. మహిపాల్, మోటివేషనల్ స్పీకర్ ఎస్. ధర్మ రెడ్డి అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో సోమవారం రైడ్స్ ఆధ్వర్యంలో సమగ్ర వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు గర్వపడేలా విద్యార్థులు శ్రద్ధతో విద్యనభ్యసించాలని సూచించారు. రైడ్స్ అధ్యక్ష, కార్యదర్శులు కె. కృష్ణ, పి. శేఖర్, అడ్వైజర్స్ కెవి మోహన్, బి. వెంకటేశం, రైడ్స్ సభ్యులు, విద్యా వికాస్ కళాశాల డైరెక్టర్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జిగా కొమిరే సుధాకర్



నందిపేట్: నందిపేట మండలంలోని షాపూర్ గ్రామానికి చెందిన కొమిరే సుధాకర్ బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సెంట్రల్ కోఆర్డినేటర్ నిషాని రామచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరామ కృష్ణ ఆధ్వర్యంలో కొమ్మిరే సుధాకర్‌ను నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గైని గంగాధర్, జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి పండు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గ ఇన్‌చార్జిలు, అధ్యక్షులు పాల్గొన్నారు.